క్లుప్తంగా

బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు జనవరి 2వ తేదీ నుంచి బ్రిడ్జి కోర్సు నిర్వహించనున్నట్లు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి 31 వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్స్‌లు, రెండు ఫోటోలతో తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. వివరాలకు సెల్ నెం. 90144 91772, 93477 95839లో సంప్రదించాలన్నారు.

ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన



తెనాలిఅర్బన్: ఓటు నమోదు ప్రక్రియ, ఓటు వేసే విధానంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు, ఎంఈవో జయంతిబాబు పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని ఆర్‌సీఎం స్కూల్ వద్ద శుక్రవారం ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, ఓటర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బ్రోచర్ ఆవిష్కరణ



తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఉపయోగించుకోవాలని, ఆరోగ్య శ్రీపై అవగాహన కల్పించాలని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం ఆరోగ్యశ్రీ అవగాహన బ్రోచర్‌లను డాక్టర్ సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు సిలార్ జానీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ఉపయోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు బ్రోచర్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మశ్రీ, ప్రసన్నలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రమవ జయతే.. పురస్కారం ప్రదానం



తెనాలిఅర్బన్: పసుపులేటి కోటేశ్వరరావు తులసమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారి గురునాథంకు శ్రమవ జయతే పురస్కారం శుక్రవారం ప్రదానం చేశారు. నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఈఎల్‌వీ అప్పారావు, అవుతు రాజశేఖర్ రెడ్డి, షేక్ మీరావలి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

తెనాలిటౌన్: విద్యుత్ చార్జీలు పెంపుపై బీజేపీ నాయకులు శుక్రవారం చెంచుపేటలోని డివిజనల్ విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్లలో 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.వాసుదేవనాయుడు, మంచాల రత్నరాజు, అడుసుమల్లి సుధాకర్, బిట్రా కనకదుర్గ, యోగానంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గణిత సిద్ధాంతాల నమూనాలు ప్రదర్శన



పెదరావూరు(తెనాలిరూరల్): జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు గణిత సిద్ధాంతాల నమూనాలను శుక్రవారం ప్రదర్శించారు. ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులు నమూనాల వివరాలు వెల్లడించారు. అనంతరం గణితంపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ, గణిత ఉపాధ్యాయులు ఒ.సాయిబాబు, ఎస్‌కే అబ్దుల్ ఖాదర్ సంధాని, జి.అరుణ, ఇతర ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలిఅర్బన్: సెమీ క్రిస్మస్ వేడుకలను తెనాలిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐతానగర్‌లో బాప్టిస్ట్ చర్చి వద్ద మదర్ థెరిస్సా హెల్ప్‌లైన్ అధ్యక్షుడు అత్తోట అమృతరాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, క్రీస్తు చూపిన బాటలో అందరూ నడవాలని సూచించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, తిరుపతి జిల్లా వ్యవసాయాధికారిణి అమలకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్, బూరెల దుర్గ, మన్నవ ప్రభాకర్, కఠారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఐతా నగర్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

- ఐతానగర్ ఈటీ కాలనీలోని హరితా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. బ్యాంకు ఆఫ్ బరోడా తెనాలి శాఖ మేనేజర్ జి.దినేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కన్నెగంటి వెంకట కిషోర్, ప్రిన్సిపల్ కృష్ణలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను ప్రిన్సిపల్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొలకలూరులో సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలిటౌన్: కొలకలూరులోని ఎస్టీ కాలనీలో డీసీఎంఎస్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండల కన్వీనర్ ప్రసాదం బాలగురవమ్మ, రాధారావు దంపతులు ఆధ్వర్యంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. రెవరెండ్ భానుప్రసాద్, పాస్టర్‌లు ఆశీర్వాదం, బర్నబాసు, రమేష్ ప్రత్యేక ప్రార్థనలు చేసి, వాక్యసందేశం అందజేశారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, బాలగురవమ్మ రాధారావు దంపతులు క్రిస్మస్‌కేక్ కట్ చేశారు. కొవ్వొత్తులు వెలగించి ప్రదర్శనలు చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్‌లను, ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ప్రేమ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దైవ సేవకురాలు మేరి జ్యోత్స్న బెంజిమెన్, రాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న దినేష్



క్రీస్తు పుట్టుక నాటిక ప్రదర్శనలో చిన్నారులు



ప్రార్థన చేస్తున్న బాలగురవమ్మ, పాస్టర్లు

విద్యతోనే పేదరికం దూరం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

వల్లభాపురం(కొల్లిపర): పేదరికాన్ని శాశ్వతంగా తరిమికొట్టే సత్తా విద్యకు మాత్రమే ఉందని, అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లభాపురం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యలో విద్యార్థులు మరో మైలురాయి చేరేలా ప్రతి పాఠశాలలో డిజిటల్ విద్యా బోధనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు హయాంలో విద్యను వ్యాపారంగా మార్చి, కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాశారని విమర్శించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దృష్ట్యా ఇప్పటికే జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక , గోరుముద్ద, నాడు–నేడు ద్వారా పాఠశాల భవనాలు, మౌలిక వసతుల కల్పన, వైఎస్సార్ సంపూర్ణ పోషణ లాంటి కార్యక్రమాలకు దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.54.910 కోట్లు ఖర్చుచేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని గర్వంగా చెప్పారు. విద్యార్థులు ట్యాబ్‌లను, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను అందిపుచ్చుకొని విజ్ఞాన్ని పెంపొందించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లభాపురం నిర్మల, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, వంగా సుధాకరరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, ఎంఈఓలు సల్మాన్‌రాజ్, ఝాన్సీలత, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.



వల్లభాపురం పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ప్రజాదరణ పొందిన సీఎం జగన్

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- 28,29 వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

తెనాలిఅర్బన్: అధికారాన్ని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించి, ప్రజా మద్దతును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత సాధించారని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 28వ వార్డు చెంచుపేట–1 సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పేద కుటుంబాలకు సీఎం జగన్ పెద్ద దిక్కులా మారారన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ యాతాటి అనిల్ మాట్లాడుతూ తన వార్డులో ఇప్పటి వరకు రూ.25.12 కోట్లతో సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డులను, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్ పర్సన్ ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్ బాబు, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- 29వ వార్డు సుల్తానాబాద్‌లోని సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణలను వివరించారు. అలాగే 29వ వార్డులో ఇప్పటి వరకు రూ.32.98 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు ఆమె వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డులను, బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు. నాయకులు రమావత్ శ్రీనునాయక్ పాల్గొన్నారు.



28వ వార్డులో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డు ఆవిష్కరణ

అత్యాధునిక హంగులతో హాస్పిటల్ భవనం

- రూ.8.5కోట్లతో హాస్పిటల్ భవన నిర్మాణం పూర్తి
- ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటు
- పరిశీలించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.8.5కోట్ల తో 30పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, జనవరిలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. నిర్మాణ పనులు పూర్తి కావటంతో కాంట్రాక్టర్ ఎమ్మెల్యే సమక్షంలో హాస్పటల్‌ను అధికారులకు శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్మాణ పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల కమిటీ సభ్యులు అవుతు కృష్ణారెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి,మండ్రు రాజు పాల్గొన్నారు.



30 పడకల హాస్పిటల్ భవనంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

ఉద్యోగుల గ్రీవెన్స్ డే



తెనాలిఅర్బన్: ఉద్యోగుల గ్రీవెన్స్ డేను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తమ సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ ఎం.జశ్వంతరావుకు వినతిపత్రాలు అందజేశారు. వాటన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

మురుగు కాల్వలపై ఆక్రమణలు తొలగించండి



తెనాలిఅర్బన్: మురుగు కాల్వలపై వేసిన నాపరాళ్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 6వ వార్డులో శుక్రవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలపై రాళ్లు ఉండటం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు తెలిపారు. ఆమె వెంట కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, ఏసీపీ సుధాకర్, ఏఈ ఫణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఉన్నారు.

26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'



తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఈ నెల 26 నుంచి జనవరి 9 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు కిట్లను అందజేశారు. ఈవోపీఆర్డీ జి.సుభాష్‌చంద్రబోస్, కార్యదర్శులు రామసుబ్బారావు, ప్రసాదరావు, వినయ్‌బాబు, విద్యాసాగర్, గౌస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానవాళికి అద్భుత సందేశం భగవద్గీత

గీతాజయంతి వేడుకల్లో స్వామి భాస్కరానంద సరస్వతి

తెనాలి: భగవద్గీత సమస్త మానవాళికి అద్భుత సందేశమని రుషీకేశ్‌లో గల స్వామి దయానంద సరస్వతి ఆశ్రమానికి చెందిన స్వామి భాస్కరానంద సరస్వతి అన్నారు. అమ్మలాలన, నాన్న రక్షణ, గురువు శిక్షణ కలగలిపినదే గీత సారాంశమన్నారు. ఆత్మవిద్యానికేతన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఆడిటోరియంలో గీతాజయంతి వేడుకలను భక్తిపూర్వకంగా నిర్వహించారు. వందలాది విద్యార్థులు, ఉపాధ్యాయులు భగవద్గీత గ్రంథాన్ని దగ్గరుంచుకుని అందులోని 18 అధ్యాయాల్లోని శ్లోకాలకు భాస్కరానంద సరస్వతి ఇచ్చిన వివరణను పారాయణ చేశారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన జ్ఞానబోధ భగవద్గీత అని చెప్పారు. వివేక విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు మాట్లాడుతూ దేశ విదేశాల్లోని అనేక విశ్వవిద్యాలయాల్లో భగవద్గీతను ఒక సబ్జెక్టుగా బోధించటం, దానిపై పరిశోధనలు జరుగుతుండటం ఆ గ్రంథానికున్న ప్రాముఖ్యతను తెలియజేస్తుందని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రాజమహేంద్రవరం ధ్యానజగతి నుంచి వచ్చిన ఐ.లీలాసరస్వతి శోభాయాత్రను ప్రారంభించారు. తైత్తిరియోపనిషత్తు గ్రంథం ఆవిష్కరించారు. శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్యకళాశాల నృత్యగురువు, ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం శ్రీకృష్ణలీలలపై నృత్యాంశాలను ప్రదర్శించారు. సీఈవో వెంకట్రామ్, ఉదయకిరణ్‌లు తీర్థ ప్రసాదాలు అందజేశారు. న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ సామాజిక సేవాకార్యకర్త జి.పద్మావతి, వివేక విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఠాగూర్, మురళి, శివకుమార్, జీవీ చౌదరి, వెంకటేష్, రాజేష్, అక్షయ్ పర్యవేక్షించారు. డాక్టర్ రావిపాటి వీరనారాయణ స్వాగతం పలికారు.



తైత్తిరియోపనిషత్తు గ్రంథం ఆవిష్కరణ

మాల ధరించిన విద్యార్థులను ఇళ్లకు పంపిన హెడ్మాస్టర్

- పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగిన హిందూ సంఘాలు, మాలధారులు
- క్షమాపణ చెప్పిన ప్రధానోపాధ్యాయుడు
- చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ

తెనాలి రూరల్: అయ్యప్ప మాలలు ధరించి దీక్షా వస్త్రాలతో పాఠశాలకు వచ్చిన విద్యార్థుల్ని మారీసుపేటలోని ఎన్‌సీఆర్‌ఎంఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బయటకు పంపించి వేసిన ఘటన వివాదాస్పదమైంది. గురువారం స్కూలుకు వచ్చిన విద్యార్థుల్ని యూనిఫాం లేదన్న కారణంతో హెచ్‌ఎం బషీర్ అహ్మద్ బయటకు పంపేయడంతో హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. విశ్వ హిందూ పరిషత్, బీజేపీ నాయకులు మాల ధరించిన స్వాములతో కలసి రోడ్డుపై స్కూలు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. స్కూల్ హెచ్‌ఎం బషీర్ అహ్మద్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. అయ్యప్ప స్వాములు, శివ స్వాములు రోడ్డు మీదనే కూర్చుని భజనలు చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగించారు. మధ్యలో స్కూలు హెచ్‌ఎం సంజాయిషీ ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ వారు విరమించలేదు. కొద్దిసేపటికి త్రీ టౌన్ సీఐ రమేష్ బాబు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకుడు పాటిబండ్ల రామకృష్ణ, విశ్వ హిందూ పరిషత్ నాయకుడు అవ్వారు శ్రీనివాసరావుతో చర్చించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో చివరికి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నుంచి లిఖితపూర్వకంగా క్షమాపణ పత్రం తీసుకున్నారు. ఆందోళనలో బీజేపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్ఐ ఎం . విజయ్‌కుమార్ తమ సిబ్బందితో పాఠశాలకు వచ్చి పరిస్థితిని అదుపు చేశారు.



లిఖిత పూర్వక క్షమాపణ ఇస్తున్న ప్రధానోపాధ్యాయుడు బషీర్ అహ్మద్

వాహనదారులకు రూ.48 వేల జరిమానా

తెనాలిరూరల్: సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి అధికారులు జరిమానా విధించారు. రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో వాహన తనిఖీల ప్రత్యేక డ్రైవ్‌ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల వద్ద నిర్వహించిన తనిఖీల్లో ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌బీ మధుసూదనరావు, చేబ్రోలు ఎస్ఐ ఆనంద్ ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 7 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. వాహనదారులకు రూ.48 వేలు జరిమానా విధించారు. వాహనదారులు అన్ని పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



వాహన తనిఖీలో అధికారులు, సిబ్బంది

విద్యార్థులకు ట్యాబులు పంపిణీ

తెనాలిటౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎంపీపీ ధర్మరాజులు చెన్నకేశవులు తెలిపారు. కఠెవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కఠెవరం, నందివెలుగు పాఠశాలల 8వ తరగతి విద్యార్థులకు 2వ విడత ట్యాబ్‌లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్రీధర్ అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి ట్యాబులను విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యలో సీఎం డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చారన్నారు. ఎంఈవో డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కనపర్తి శశికుమార్, హెచ్‌ఎంలు శ్రీధర్, శివపార్వతీ, పంచాయతీ కార్యదర్శి వినయ్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టైర్ పంక్చర్.. కారు బోల్తా

గుంటూరు రూరల్: కారు టైర్ పంక్చర్ అవ్వటంతో కారు బోల్తా పడిన సంఘటన పొత్తూరు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురంకు చెందిన నలుగురు స్నేహితులు కారులో కోటప్పకొండకు బయలుదేరారు. దేవుని దర్శనం ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా పొత్తూరు వద్ద టైర్ పంచర్ అయ్యింది. దీంతో వేగంగా వెళుతున్న కారు ఒక్కసారిగా పల్టీలు కొట్టింది. కారులో బెలూన్స్ ఓపెన్ అవ్వటంతో ఎవ్వరికి ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలి

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్ బెర్రి స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీబీఎస్ఈ రీజినల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర, స్కూల్ జేఎండీ ప్రసన్నాంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేశారు. సభలో శేఖర్ చంద్ర మాట్లాడుతూ స్కూల్లో సీబీఎస్ఈ విద్యావిధానాలను పటిష్టంగా అమలు చేస్తున్నారని, విద్యార్థులు నేటి రోజుల్లో జరుగుతున్న పరిణామాలు గమనించుకుంటూ గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. స్కూల్ జేఎండీ ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆర్టిఫిషీయల్, ఇంటిలిజెన్స్ ఎలాంటి మార్పులు చేస్తుందో, విద్యావ్యవస్థలో ఎటువంటి మార్పులు సృష్టిస్తుందో తెలిపారు. విద్యార్థులు వివిధ రాష్ట్రాల పండగల ప్రాముఖ్యతను తెలియజూస్తూ.. సంప్రదాయదుస్తులతో నృత్యాలు చేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు టీవీ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చంద్రశేఖర్, ప్రసన్నాంజనేయులు

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా

ప్రత్తిపాడు: రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై నిత్యం ప్రత్యేక నిఘా ఉంచాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా అన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషనులోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, వాటి పురోగతికి తీసుకోవలసిన చర్యలపై సీఐ ఎం.వి. సుబ్బారావు, ఎస్ఐ డి. రవీంద్ర బాబులతో చర్చించారు. పెండింగ్ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓర్పుతో విని పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించి ప్రజా జీవితానికి ఆటంకం కలిగించే వ్యక్తులను ఉపేక్షించవద్దని, ప్రత్తిపాడులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎస్ఐకు స్పష్టం చేశారు. విద్యా సంస్థల్లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.